

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్ధం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

**"హేమంత్, ప్లీజ్ కమ్ అవుట్ ఆఫ్ దిస్**. ఎంతకాలం ఈ జ్ఞాపకాల భారంతో నిన్ను నువ్వు హింసించుకుంటావ్? ఇదంతా మరచిపోయి తీరాలి నువ్వు" తీవ్రంగా ఉంది అరుణ్ స్వరం.

అంతకంటే తీవ్ర స్వరంతో అరిచాడు హేమంత్.

"చచ్చిపోతే మరచిపోగలను, చావనివ్వలేదు కదరా నువ్వు. నువ్వేగా బ్రతికి వుండి ఈ నరకం అనుభవించమన్నావ్."

అతడి స్వరంలో తీవ్రతకు ఉలికిపడ్డాడు అరుణ్. నెమ్మదిగా అన్నాడు, "ప్లీజ్ హేమంత్.. నీలాంటి ఒక వ్యక్తి, నీలాంటి ఒక డాక్టరు మాట్లాడే మాటలేనా ఇవి?"

"ఇంకేం మాట్లాడమంటావ్ చెప్పు? ఒకసారి చూడాలని వుంది రమ్మన్నారు అమ్మా, నాన్నగారు. పాపం వాళ్ళిద్దరూ బ్రతిమలాడారురా 'మాకు అంత దూరంగా వెళ్ళిపోయి వైజాగ్‌లో చేరవద్దు మెడిసిన్‌లో, ఢిల్లీలో జాయిన్ అవ్వమని.

"నేను వినలేదు, వైజాగ్‌కే వెళ్ళిపోయాను. వాళ్ళు కోప్పడలేదు. ఒక్కమాట అనలేదు. పాపం లోలోపల ఎంతో బాధను దాచుకుని, దీవించి పంపించారు నన్ను. సెలవులకు వెళ్ళేవాడిని. నాకు అమ్మా, నాన్నా అంటే చాలా ఇష్టంరా.

"అనూహ్యంగా లత ప్రవేశించింది నా జీవితంలో.. అమ్మా, నాన్నగారు చేసే సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకునేది తను. నా ఇన్‌టర్న్ షిప్ అయిపోవచ్చిన సమయంలో లత, నన్ను వాళ్ళ ఫాదర్‌కు పరిచయం చేస్తానంది.

"అలాగే అమ్మను, నాన్నగారిని కూడా చూస్తాను, ఆగ్రాకు తీసుకువెళ్ళమని అడిగింది. తీసుకెళ్తాను త్వరలోనే అని మాటిచ్చాను."

"లత ఆగ్రాకు వచ్చిందా?" అడిగాడు అరుణ్.

"నేను ఆగ్రాకు నాలుగురోజులలో వెళ్తాననగా తను చాలా అలజడికి లోనైంది. 'నువ్వు లేకుండా ఇక్కడ ఎలా వుండాలి హేమంత్' అంది పదే పదే.

"మరి నీతో ఎందుకు తీసుకెళ్ళలేదు అపుడు?" అరుణ్ అడిగాడు.

"తనకు ఎగ్జామ్స్ ఉన్నాయిరా. అప్పుడు చెప్పాను, నేను తిరిగి వచ్చేవరకు కర్నూలుకు వెళ్ళమని. ఇక 'ఓకె' అనుకున్నాం. కాని రేపు ప్రయాణం అనగా ఆ రాత్రి లత ఏడుస్తూ ఫోన్ చేసింది, వాళ్ళ నాన్నగారు పోయారని, వెంటనే కర్నూలుకు వెళ్ళాలని. నీకూ తెలుసుగా, అప్పుడు లతను కర్నూలుకు తీసుకువెళ్ళాను. అర్ధరాత్రి బయల్దేరి వెళ్ళాం.

"నన్ను ఆయనకు చూపాలనుకున్నానని చాలా బాధపడింది తను. అంత బాధలో ఉండి లత మదర్ 'బిడ్డకు కడసారి చూపులు అందేలా చేశావ్ బాబూ ' అన్నారు కృతజ్ఞతగా. వాళ్ళ మామయ్యకు మాత్రం నాపై కన్నెర్రగా వుందని గ్రహించాను.

"లతను ఓదార్చి, తనకు నేనున్నానని చెప్పి ధైర్యంగా వుండమన్నాను. నేను వెళ్ళి పేరెంట్స్‌కు తన విషయం తెలియచేస్తాననీ, అలాగే వచ్చాక వాళ్ళ అమ్మగారితో మాట్లాడతాననీ చెప్పాను. పాపం వాళ్ళ మేడపై కిటికీలో నుంచి చెయ్యి వూపింది. నా కోసం ఎదురు చూస్తూ వుంటానని చెప్పింది కన్నీళ్ళతో.

అదే ఆఖరు మా కలయికకు. ఇదిగో అయిదేళ్ళ తర్వాత మళ్ళీ ఇలా కలిసింది నాకు" భారంగా నిట్టూర్చాడు హేమంత్.

"ఇదుగో కాఫీ వచ్చింది, ముందు తాగు" అంటూ కప్పు చేతికి అందించాడు అరుణ్.

తాగాక మళ్ళీ మాట్లాడబోయిన హేమంత్‌ను వారించాడు అరుణ్ చిరుకోపం ప్రదర్శిస్తూ.

"దయచేసి ఇదంతా ఇక్కడితో ఆపేయ్ హేమంత్. ఎంతకాలంరా ఇలా నిన్ను నువ్వు హింసించుకుంటావ్? భవిష్యత్ వైపు చూడరా ఇక."

అరుణ్ స్వరంలో తీవ్రతకు అతడి ముఖంలోకి చూశాడు హేమంత్.

"నా హృదయం ఈ లావాను భరించలేదురా, దానిని ఆవిరై బయటకు వచ్చేయనియ్యి ఒక్కసారిగా. ఆ తర్వాత ఇంకెన్నడూ ఈ విషయాలు మాట్లాడను."

తల వాల్చి కూర్చున్నాడు అరుణ్.

"నన్ను కన్న తల్లితండ్రులు రా వాళ్ళు. పాపం, ఒక్క స్వార్ధపు ఆలోచన కూడా లేనివాళ్ళు. వాళ్ళ జీవితాన్నే మానవసేవకు దేవాలయంలా మలచుకున్న దేవతల్లాంటి వ్యక్తులకు అదా శిక్షా.. నా కళ్ళెదుటరా..." అంటూ తీవ్రమైన ఉద్వేగానికి గురైన హేమంత్ వీపుపై తడుతూ కూర్చున్నాడు అరుణ్.

"ప్లీజ్‌రా, హేమంత్ కంట్రోల్ యువర్ సెల్ఫ్."

"అమ్మ, నాన్నగారు నన్నొక పసిపిల్లవాడిని ముద్దాడినట్లు దగ్గరకు తీసుకున్నారు. ఎన్నాళ్ళకో కలిసిన స్నేహితుల్లా మాట్లాడుకున్నాం. ఆ తర్వాత అయిదారు రోజుల వరకూ కూడా లతతో టచ్‌లోనే ఉన్నా.

'హేమ్ ప్లీజ్, తొందరగా వచ్చేయ్.. ఎగ్జామ్స్ దగ్గరకు వస్తున్నాయి. నువ్వు లేని వైజాగ్‌కు వెళ్ళబుద్ధి కావటంలేదు...' అదే లాస్ట్‌గా మాట్లాడింది. తర్వాత లత ఫోన్ అస్సలు కలవలేదు. నెట్‌వర్క్ ఏరియాలో లేదనే వచ్చింది ఎన్నిసార్లు చేసినా, "ఆ మరుసటి రోజు ఇంటికి ఎవరో రెలెటివ్స్ వచ్చారు. అంతకు ముందు నేను ఎపుడూ చూడలేదు. అమ్మ చెప్పింది 'నాన్నగారి సిస్టర్ వసంతసేన, ఆవిడ కూతురు చందన' అని వాళ్ళు రెండురోజులు ఉండి వెళ్ళిపోయారు.

ఆ మరుసటి రోజు నాన్నగారు చెప్పారు, 'నా కన్నవారి నుండి నాకు మిగిలిన ఒకే ఒక బంధం వసంత. నాకు చందనను కోడలిని చేసుకోవాలనుందిరా, ఆ విధంగానైనా మేము ఇద్దరం దగ్గరవ్వచ్చు అని వుంది . జస్ట్ ఇది మా ఆలోచన మాత్రమే హేమంత్. నిర్ణయం నీదే సుమా ' అని. అమ్మ సైలెంట్‌గా ఉండిపోయింది.

"అపుడు నేను నా సెల్‌లో ఉన్న లత ఫోటో చూపించి, నెమ్మదిగా మా గురించి చెప్పాను. నాన్నగారు కొంచెం డిజప్పాయింట్ అయినా గాని సంతోషంగానే వున్నారు.

'అమ్మాయి బాగుంది, పైగా మా అమ్మ పేర్లో సగం ఉంది 'లత'. నీ సంతోషమే మాకు ముఖ్యం అన్నారు. లత సెల్ పరిస్థితి అలాగే వుంది. అపుడే నీతో మాట్లాడాను, గుర్తుందా నీకు? ఆ సెల్ ఏమైనా రిపేర్ ఏమోలే, అయినా నాలుగైదు రోజుల్లో నువ్వు వచ్చేస్తున్నావు కదా ' అన్నావు. నేనూ అలాగే సమాధానపడ్డాను.

"అమ్మ లత కోసం చీరలు, జ్యుయెలరీ అవి తీసుకోవాలి అంది. అపుడు వద్దులే అన్నాగాని అమ్మ ఒప్పుకోలేదు. ఆగ్రాలోనే చూద్దాం అంటే, కాదు ఢిల్లీ వెళ్దాం అంది అమ్మ. ఆ ఒక్క ఆలోచనతోనే నా జీవితం చిన్నాభిన్నం అయిపోయిందిరా.

"మర్నాడు వైజాగ్‌కు నా ప్రయాణం అనగా, ముందు రోజు ఎర్లీ ఫ్లైట్‌కు ఢిల్లీ వెళ్ళాం. చాందినీ చౌక్ ఏరియాలో చీరలు, డ్రెస్‌లు బాగుంటాయి అంది అమ్మ. లతకోసం చాలా తీసుకుంది. తిరిగి తిరిగి అలసిపోయాం ముగ్గురం."

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని మౌనంగా ఉండిపోయాడతడు.

అతడి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు అరుణ్.

"లంచ్ చేద్దాం అని ఒక రెస్టారెంట్‌కు వెళ్ళాం. చేతులు వాష్ చేసుకు కూర్చున్నాం టేబుల్ దగ్గర. ఫుడ్ ఆర్డర్ చేశాను.

నాన్నగారు 'ఇంకేదైనా మర్చిపోయావేమో చూడు వసూ ' అన్నారు.

అమ్మ 'మనం ఎలాగూ నెక్స్ట్ మంత్ వైజాగ్‌కు వెళ్దాం అనుకుంటున్నాముగా అప్పుడు ఏం కావాలో లతను అడిగి తీసుకు వెళ్దాం' అంది.

"లతను నాకు కాబోయే భార్యగా ఆప్యాయంగా భావిస్తున్నారు అమ్మా నాన్నగారు. నాకు ఆ ఫీలింగ్ చాలా హ్యాపీగా అనిపించింది.

నాన్నగారు నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కారు. 'హేమంత్ ఎన్ని చదువులు చదివినా, ఎంత ఉన్నతంగా ఎదిగినా, ఎంత సంపాదించినా అది గొప్ప విషయం కాదురా. నిన్ను మన్సు నిండా నింపుకుని, నీ విజయాలన్నీ తనవిగా భావిస్తూ నీవెంటే వుండి, నిన్ను ప్రేమించే భార్య దొరకటం అన్నది ఒక గొప్ప వరంరా...'

అంతలో నా సెల్ రింగ్ అవ్వటం మొదలు పెట్టింది. ఆన్ చేశాను. ఎవరో లేడీ వాయిస్. సిగ్నల్ అందక క్లారిటీ లేదు.

లంచ్ ట్రేలు తెచ్చిన వెయిటర్ 'ఇక్కడ సిగ్నల్స్ రావు సార్. బయటకు వెళ్ళి మాట్లాడండి' అన్నాడు.

కట్ అయిపోయింది. మళ్ళీ మ్రోగుతుంది.

"డాడ్, మీరు తింటూ ఉండండి. నేను ఈ కాల్ మాట్లాడేసి వస్తాను" అంటూ ఛెయిర్ లోంచి లేచి బయటకు వెళ్ళాను. ఆ ఫోన్ కనెక్ట్ కానూ లేదు, మళ్ళీ రానూ లేదు. నేను రింగ్ చేసినా రెస్పాన్స్ లేదు.

ఆ నెంబర్ ఎవరిదో ఒకవేళ లత తన సెల్ పని చెయ్యకపోతే తనే వేరే నంబర్ నుంచి చేసిందేమోనన్నఆలోచన వచ్చింది నాకు. మళ్ళీ మళ్ళీ రింగ్ చేసాను ఆ నంబర్‌కు. 'స్విచ్డ్ ఆఫ్ ' అని వచ్చింది. ఆ నంబర్ చూసి చూచాయిగా మనసులో గుర్తుంచుకున్నాను.

"ఇక రెస్టారెంట్‌లోకి వెళ్దాం అని వెను తిరిగాన్రా అరుణ్. అంతే పెద్ద శబ్దంతో ప్రేలుడు అక్కడ. నేను ఎగిరి దూరంగా పడ్డాను.. అది... అది అంతే తెలుసు నాకు.." ఆగాడు అతడు. అతడి కనురెప్పలను దాటి చెంపలను తడుపుతున్నాయి పొంగి వస్తున్న కన్నీళ్ళు.

"నాకు స్పృహ వచ్చింది. శరీరం అంతా బాధ. ఒక కాలు అసలు కదపలేని స్థితిగా వుంది. తల వెనుక పక్క కూడా నొప్పి.

"ఎదురుగా హడావుడిగా తిరుగుతున్న డాక్టర్లను, నర్సులను, వేరే బెడ్‌లపై ఉన్న పేషెంట్లను చూసాక నేను ఈ లోకంలోకి వచ్చాను. నెమ్మదిగా అర్ధమైంది నేను హాస్పిటల్‌లో ఉన్నానని.

"ఎదురుగా కనిపిస్తున్న డాక్టర్లను, నర్సులను కేకలు వేసి పిలిచాను. అందులో ఒక డాక్టర్, దగ్గరకు వచ్చాడు. అతడు నా మెంటల్ కండిషన్ తెలుసుకోవటానికి "హలో మీ పేరేంటి? ఢిల్లీనేనా మీది?" లాంటి ప్రశ్నలు వేశాడు.

నేను చెప్తుండగానే కంగారుగా మరో బెడ్ దగ్గరకు వెళ్ళిపోతున్న అతడి చెయ్యి పట్టుకున్నాను.

"ప్లీజ్ డాక్టర్, నేనూ డాక్టర్నే. కొంచెం మాట్లాడాలి.. " అన్నాను.

"ఇప్పుడే వస్తాను.. ప్లీజ్" అంటూ చెయ్యి విడిపించుకుని వెళ్ళిపోయాడు.

జరిగింది నెమ్మదిగా అర్ధమవుతుంది నాకు. నా మనసు పని చెయ్యడం మొదలుపెట్టింది.

అయ్యో, అమ్మా, డాడ్ అంటూ కంగారుగా లేవబోయాను.

'నో ' అంటూ ఒక లేడీ డాక్టర్ వచ్చి పట్టుకుంది నన్ను.

"మీరు మూవ్ కాలేరు" అంది.

నా గుండె ఆగినంత పనైంది. "నాకు ఏమైంది డాక్టర్.. ప్లీజ్ నిజం చెప్పాండి, నేనూ డాక్టర్నే."

"డోంట్ వర్రీ, మీకు రైట్ లెగ్ కాఫ్‌కు తీవ్రమైన గాయం అయింది. అది కేవలం కండరానికే కాకుండా బోన్‌కి కూడా ఎఫెక్ట్ అయింది.

"ఆమె చెప్తుంటే మధ్యలోనే అరిచాను, 'అసలు నా కాలు ఉందా? అన్ని పార్ట్‌లూ ఉన్నాయా? ఏం జరిగిందో చెప్పండి'అంటూ.

నా అరుపులకు అంతకుముందు వెళ్ళిపోయిన డాక్టర్ పరుగున వచ్చాడు. అతడు నా బెడ్‌పై కూర్చున్నాడు.

"మీరు డాక్టర్ అన్నారు కదా. ధైర్యంగా ఉండండి. మీకు కుడికాలు మోకాలుకు క్రింద వెనుక భాగంలో గాయమైంది. నయమైపోతుంది. కాని టైం పడుతుంది. కండరాలకు, ఎముకలకు కూడా మల్టిపుల్‌గా గాయాలయ్యాయి. మీకు ఫస్ట్ ఎయిడ్ చేసాం బ్లడ్ పోకుండా కాపాడేం. ఇప్పుడు స్కాన్ రిపోర్ట్ వస్తుంది.  దాన్ని చూసాక అయ్ కెన్ గివ్ యు ఎ క్లియర్ ఇన్‌ఫర్మేషన్.'

'డాక్టర్, అమ్మా, నాన్నా, నేను చాందినీ చౌక్‌లో కలిసే వున్నాం ' మరి వాళ్ళూ ఇక్కడున్నారా? ఏమయ్యారు...'

తలబాదుకు దుఃఖిస్తున్న నా చేతులను పట్టుకున్నాడు అతడు.

మొన్న చాందినీ చౌక్‌లోని ఒక రెస్టారెంట్‌లో బాంబుపేలింది. ఆ తర్వాత వేరే చోట్ల ఇంకా వరుస ప్రేలుళ్ళు జరిగాయి. చాలా మంది చనిపోయారు. ప్రాణాలతో ఉన్న, వాళ్ళని హాస్పిటల్స్‌కు తరలించారు. ప్లీజ్ ఇప్పుడే వస్తా. అంటూ మరొక బెడ్ దగ్గరకు వేగంగా వెళ్ళిపోయాడతడు.

'రెస్టారెంట్‌లో బాంబు పేలిందా? అదే రెస్టారెంటా.. ఎలా ఏం చెయ్యను. నా బాధ వర్ణనా తీతం."

"అంతలో ఒక సిస్టర్ ఇంజెక్షన్ తెచ్చింది. చూసాను, అది నన్ను మత్తులోనికి పంపటానికి. ఆ ఇంజెక్షన్ తీసుకోలేదు నేను ఆ డాక్టర్, అతడి కోటుపై పేరు చూసాను రోహిత్ అని వుంది. అతడు వచ్చాడు

"మీరు ట్రీట్‌మెంట్‌కు అడ్డుచెప్పకూడదు. మీరూ డాక్టరే అన్నారుగా. ఆ పెయిన్ స్టార్ట్ అయితే తట్టుకోలేరు. ఇంజెక్షన్ తీసుకోవాలి మీరు."

"డాక్టర్‌నే. కాని అంతకంటే ముందు ఒక కొడుకుని. నా పేరెంట్స్, నేనూ కలిసే ఆ రెస్టారెంట్‌కు వెళ్ళాం, నేను ఫోన్ సిగ్నల్ కోసం రెస్టారెంట్ వెలుపలకు వెళ్ళాను. అంతే ... పెద్ద ప్రేలుడు.. అయ్యో వాళ్ళేమైపోయారో. మైగాడ్ ప్లీజ్ సేవ్ మై పేరెంట్స్...' అంటూ బిగ్గరగా ఏడిచానురా. అంతో సెల్ గుర్తొచ్చింది.

'నా సెల్.. నా ఫోన్..' అంటూ చుట్టూ చూస్తున్న నా చేతిని చేతిలోకి తీసుకున్నాడతడు.

'మిస్టర్...' ఆగాడతడు.

'హేమంత్ ' అన్నాను.

'చూడండి మిష్టర్ హేమంత్, ఆ ప్రాంతంలో మనుషులే తునాతునకలైపోయారు. మీరు సెల్ అంటున్నారు. యు ఆర్ సో లక్కీ గాయంతో మిగిలారు. ముందు మీరు లేవాలి, అది చూడండి.

'సర్, నేను చెప్పిన నంబర్‌కు రింగ్ చెయ్యండి ప్లీజ్ ' అడిగాను.

'చెప్పండి అన్నాడు ఆయన, నీ నంబర్ చెప్పానురా. నువ్వు లిఫ్ట్ చెయ్యలేదు. నాలో నేను ఏడుస్తూ ఒక శవంలాగ పడి వున్నాను. అటువంటి హెల్ప్‌లెస్ పరిస్థితి ఘోరం రా.. ఎవరికీ రాకూడదు. పది నిమిషాల తర్వాత సెల్ పట్టుకుని వచ్చాడు డాక్టర్ రోహిత్.

'మిష్టర్ హేమంత్ మీకు కాల్ వచ్చింది ' అంటూ

"చచ్చినవాడిలా వున్న నాకు కొంచెం ఊపిరి వచ్చింది నీతో మాట్లాడాక. నీకోసం నిమిషాలు లెక్కపెట్టుకుంటూ ఎదురు చూశానురా, మన క్లాస్‌మేట్ మహేష్‌ను తీసుకుని వచ్చావు."

గతం అంతా కళ్ళలో మెదిలేసరికి అరుణ్‌కు కూడా కళ్ళు నిండాయి.

కాసేపు నిశ్శబ్దం చోటు చేసుకుంది ఇద్దరి మధ్య.

హేమంత్ చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకున్నాడు అరుణ్.

అరుణ్, కాలం తెరల మాటుకు వెళ్ళిపోయి మసకగా మారుతున్న జ్ఞాపకాలను పట్టి, మళ్ళీ వెనక్కు తెచ్చుకున్నాడు స్పష్టమయ్యేలా.

"హేమంత్, ఆ ప్రాంతాలలో ఫోటోలను పేపర్లో పబ్లిష్ చేసారు .రెస్టారెంట్‌లో ఉన్న కొన్ని వస్తువుల శిధిలాలను నువ్వు గుర్తించావు. ఆ రెస్టారెంట్లో ఎవరూ మిగలలేదు కదరా. అయినా, మహేష్, నేనూ ప్రతి హాస్పిటల్‌కు తిరిగాం వెతుక్కుంటూ. 'ఎక్కడైనా ఉండి, దొరికితే బాగుండును' అని కోరుకునేవాడిని రా హేమంత్, నీ బాధను చూడలేక. ఒక పక్కన నీ కాలుకు రెండు మూడు ఆపరేషన్లు చేశారు. ఇంకా ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా దొరకని ఆచూకీ, పోలీస్ స్టేషన్స్, శరణాలయాలు వెతుక్కుంటూ ఢిల్లీ అంతా వెతికిన ఫలితం లేని పరిస్థితి. నేను కూడా ఏదీ మరిచిపోలేదురా. నేను వచ్చేసరికి ఆశగా ఎదురుచూసే నీ చూపులను తట్టుకోలేక నాలో నేను కుమిలిపోయాను."

"సారీ రా అరుణ్, నాతోపాటు నిన్నూ బాధిస్తున్నాను గతంలోకి తీసుకెళ్ళి" అంటూ అరుణ్ చేతులలోనుంచి దూరంగా జరిగాడు హేమంత్.

"అలా నన్ను వేరు చేసి బాధించకు హేమంత్. నాకు ఎపుడూ కూడా, నన్ను నీకు దూరం చేసే 'నా' అన్న ఆలోచనేలేదురా మనసులో. హేమంత్, అంత మంచివాళ్ళు తన దగ్గరే ఉండాలని అమ్మను, నాన్నగారిని తీసుకుపోయాడురా దేవుడు. మనసును అలా సమాధాన పరచుకోవాలి మనం."

"స్టాప్ దట్ నాన్సెన్స్ అరుణ్. ఇంకెప్పుడూ నా దగ్గర 'దేవుడు' అని అనకు వాడే ఉంటే ఇందరు అమాయకులను అంతం చేసే అవకాసం ఎందుకిస్తాడు దుర్మార్గులకు? లతను చూడాలని, తనకోసం ఎన్నో కొన్నారు పాపం."

అరుణ్‌కు మాటలు కరువయ్యాయి 'హేమంత్ ఆలోచనలను మళ్ళించాలని అతడి మీద అరుస్తున్నాడు తను. కాని జరిగింది సాధారణమైన ఘోరమా! ' అతడి మనసు భారంగా వుండి. నెమ్మదిగా లేచి వెళ్ళి వాష్ బేసిన్‌లో ముఖం కడుక్కు వచ్చాడు అరుణ్. "కాస్త ముఖం కడుక్కోరా" అంటూ లేవదీశాడు హేమంత్‌ను.

టవల్‌తో ముఖం తుడుచుకుంటూ సోఫాలో కూర్చున్నాడు హేమంత్.

"కర్నూలు నుంచి వైజాగ్ వెళ్ళి ఎవరో నీ గురించి ఎంక్వైరీ చేసారట కాలేజ్‌లో, హాస్పిటల్‌లో కూడా. లక్కీగా వాళ్ళకి మహేష్ దొరికాడట. వాడు అదే హాస్పిటల్‌లో వర్క్ చేస్తున్నాడు కదా. వాడికీ లత గురించీ, నీ గురించి అంతా తెలుసు. ఎందుకంటే లత ఫైనల్‌లో డిస్ కంటిన్యూ అయిపోయింది. కథలుగా రూమర్స్ కాలేజ్‌లో.."

"అది ఆపి విషయం చెప్పు" హేమంత్ స్వరం పెరిగింది విసుగ్గా.

"ఢిల్లీలో జరిగిన పేలుళ్ళలో మీ ఫ్యామిలీ అంతా బలైపోయిందని నమ్మేలా చెప్పాడట. నేను మీ మామయ్యగారికి ఫోన్ చేశాను .అంతా ఓకేరా, వాళ్ళను ఎవరూ టచ్ చెయ్యలేదు."

"అవునురా అరుణ్. ఆ టైములో ఆ ఫోన్ కాల్ కనక రానట్లైతే నేనూ వాళ్ళతో పాటే చచ్చి, బ్రతికిపోదును ఈ బాధలను మోసుకుంటూ తిరగకుండా" భారంగా నిట్టూర్చాడు హేమంత్.

"అలా మాట్లాడకురా హేమంత్. నువ్వు ఆగ్రాకు ఫ్లైట్ అంటే మర్నాటికి ఉంది. నేను 'రేపు వెళ్ళరా ' అన్నా వినకుండా కదిలిపోతు న్న ట్రయిన్ ఎక్కేశావ్ కదా?"

"అవును."

"నీకు ఫ్లైట్ టికెట్ దొరికివుంటే లత కలిసేది కాదు, బ్రతికేది కూడా కాదు."

"అది నిజమే. అందుకు నాకు నేనే థాంక్స్ చెప్పుకున్నాను."

"మనకు అనుకూలంగా ఏది జరిగినా, వెంటనే 'థాంక్ గాడ్' అంటాం. అదే ఏదైనా నచ్చనిది జరగగానే ఫస్ట్ టార్గెట్ దేవుడే. ఇక నీకు అంతా మంచే జరుగుతుందిరా."

"అయితే, అమ్మా, నాన్నా వచ్చేస్తారా వెనక్కి?" అంటూ అక్కడనుంచి లేచాడు హేమంత్.

"దానికి జవాబు లేదురా నా దగ్గర" దిగులుగా అన్నాడు అరుణ్.

అంతలో హేమంత్ సెల్ మోగింది. నెమ్మదిగా ఆన్ చేసి "హలో" అన్నాడు.

"హలో, నేను మీకు తెలియదు సార్."

"మరి నాకు ఫోన్ ఎందుకు చేసినట్టు?" అడిగాడు హేమంత్.

"కొంచెం నా మాటలు వినండి సార్" స్పీకర్ ఆన్ చేసాడు హేమంత్, అరుణ్‌ను వినమని సైగచేస్తూ.

"చెప్పండి ఏంటి విషయం?"

"మూడు రోజుల క్రితం జిటి ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి వెళ్తున్నాను సార్. ఒకావిడ విజయవాడలో ఎక్కింది, నా ఎదుటి సీట్లోనే కూర్చుంది" వింటున్న హేమంత్, అరుణ్‌లు ఎలర్ట్ అయ్యారు.

హేమంత్‌కు ఆశ్చర్యంగా వుంది. అరుణ్‌కు భయం అనిపించింది.

హేమంత్, లతల కోసం ఇదొక రకం కూంబింగ్ ఏమో అనుకున్నాడు.

"అయితే?" అన్నాడు హేమంత్.

"ఆవిడ, ఒక్క కాల్ చేసుకుంటాను ఒక్కసాఇర్ మీ సెల్ ఇస్తారా?" అని అడిగింది. ఎవరికైనా ఒకోసారి అవసరం వస్తుంది కదా అని సెల్ ఇచ్చాను సార్. ఆమె ఒక్ అనంబర్‌కు రెండు మూడుసార్లు కాల్ చేసింది. కలవటం లేదు అంటూ నిరాశగా తిరిగి ఇచ్చేసింది నాకు.

"ఆ తర్వాత ఆమె ఒక బుక్‌లో ఏమో రాసుకుంటూ కూర్చుంది చాలాసేపు. ఆ తర్వాత కూడా కొంతసేపు బాగానే వుంది ఆమె. ఉన్నట్టుండి ఆమె ఏదో బాధతో మూలుగుతూ మెలికలు తిరగసాగింది. అప్పుడు ట్రయిన్ లోనే ఉన్న డాక్టర్‌గారు ఒకాయన ఆమెకు ఇంజెక్షన్లు చేశారు. ఆవిడ ముఖం చూసిన ఆ డాక్టర్ ఒక్కసారిగా షాక్ తిన్నట్లు 'లతా' అని కేకపెట్టాడు. ట్రయిన్‌ను ఆపేసి ఆమెను అంబులెన్స్‌లో నాగపూర్‌కు తీసుకు వెళ్ళారు. ఆవిడ లగేజ్ కూడా ఆయన చేతికి ఇచ్చాం. ఇందాక, ఆవిడ నా సెల్ నుంచి చేసిన నంబరు కనిపించింది ఫోన్‌లో. అందుకే మీ నెంబర్‌కు నా కాల్ వచ్చింది. మీకు ఆవిడ కబురు ఏమైనా అందిందా? ఆమెను కలిసారా? ఆవిడ ఆరోగ్యం ఎలా వుందో తెలుసుకోవాలనిపించి ఈ కాల్ చేశాను."

"ఆమె మాతోనే వుంది. ఆమె ఆరోగ్యం కాస్త కుదుటపడింది. మీ కన్‌సర్న్‌కు థాంక్స్ అండి" అంటూ సెల్ ఆఫ్ చేశాడు హేమంత్.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS